ప్రిన్సిపాళ్లకు సూచనలిస్తున్న డీఐఈవో రవికుమార్

ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

■ ఇంటర్ ఫలితాలపై డీఐఈవో సమీక్ష

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 30 : ఇంటర్‌లో ఫెయిలైన ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి వారి ఉత్తీర్ణతకు కృషి చేస్తామని డీఐఈవో రవికుమార్ తెలిపారు. ఇటీవల విడుదలైన ఫలితాలపై జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో తన కార్యాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. సబ్జెక్టుల వారీగా తక్కువ ఉత్తీర్ణత సాధించడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఇంటర్ బోర్డు నిర్ణయం మేరకు ఆయా సబ్జెక్ట్ లెక్చరర్ల ద్వారా వెంటనే బోధనా తరగతులను ప్రారంభించాలని ఆదేశించారు. సప్లిమెంటరీ పరీక్షలు రాయనున్న విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిక

బీఆర్ఎస్‌లో చేరినవారికి కండువాలు కప్పిన జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్

డిచ్‌పల్లి, ఏప్రిల్ 30: డిచ్‌పల్లి తండాకు చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు మాజీ సర్పంచ్ రూప్‌సింగ్ ఆధ్వర్యంలో మంగళవారం బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ధర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మోహన్‌నాయక్, సుమన్, శ్రీను, శేనియా, గణేశ్, శత్రు, గద్దర్ ఉన్నారు.

'విద్యాకుసుమాలు' పుస్తకావిష్కరణ

కథల సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్య అతిథులు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 30 : డిచ్‌పల్లి పోలీస్ క్యాంపులోని విద్యా హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రచించిన కథల సంకలనం 'విద్యాకుసుమాలు' పుస్తకాన్ని మంగళవారం ఆవిష్కరించారు. యువ రచయిత్రి, తెలుగు ఉపాధ్యాయిని ప్రణవి మార్గదర్శనంలో విద్యార్థులు రాసిన 27 కథలు ఈ పుస్తకంలో ఉన్నాయని కరస్పాండెంట్ అనితా శ్రీశైలం తెలిపారు. ముఖ్య అతిథులుగా ఇందూరు జిల్లా బాలసాహిత్య వేదిక అధ్యక్షుడు డాక్టర్ కాసర్ల నరేశ్‌రావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ శారద హాజరై విద్యార్థులను అభినందించారు.

తైక్వాండో కలర్‌బెల్ట్ ప్రమోషన్ టెస్టులు

కంఠేశ్వర్, ఏప్రిల్ 30: నగరంలోని బస్వాగార్డెన్‌లో మంగళవారం అమేచర్ తైక్వాండో క్రీడాకారులకు కలర్‌బెల్ట్స్ ప్రమోషన్ టెస్టులు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తైక్వాండో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాజిరెడ్డి జగన్ హాజరై అభినందించారు. కార్యక్రమంలో తైక్వాండో జిల్లా ప్రధాన కార్యదర్శి, ఒలింపిక్ అసోసియేషన్ కార్యవర్గసభ్యుడు మనోజ్‌కుమార్, జేసీఐ సభ్యులు స్వరూప్ కుమార్, జైపాల్ పాల్గొన్నారు.

ప్రజల నాయకుడు బాజిరెడ్డిని
భారీ మెజారిటీతో గెలిపిద్దాం

సారంగాపూర్/డిచ్‌పల్లి/ఇందల్వాయి, ఏప్రిల్ 30 : నిజామాబాద్ రూరల్ మండలంలోని కొత్తపేట, లింగి తండా, గాంధీనగర్ తండా గ్రామాల్లో ఉపాధి హామీ పనులు కొనసాగుతున్న ప్రాంతాల్లో జడ్పీటీసీ బొల్లెంక సుమలతా గోపాల్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎల్ల వేళలా జనంతోనే ఉండే ప్రజా నాయకుడు బాజిరెడ్డి గోవర్ధన్‌కు కూలీలందరూ సంపూర్ణ మద్దతు తెలిపి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మీసాల మధుకర్‌రావు, ఎంపీపీ అనూషా ప్రేమ్‌దాస్, వైస్ ఎంపీపీ అన్నం సాయిలు, మాజీ సర్పంచులు అశోక్, అనూషా లక్ష్మణ్, ప్రవీణ్‌గౌడ్, అరుణా సాయిలు, నాయకుడు గంగారాం నాయక్ పాల్గొన్నారు. డిచ్‌పల్లి మండలం నాకా తండా, వెస్లీనగర్ తండాలో బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డికి మద్దతుగా సీనియర్ నాయకుడు శక్కరికొండ కృష్ణ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. ప్రచారంలో జడ్పీటీసీ దాసరి లక్ష్మీనర్సయ్య, నల్లవెల్లి సాయిలు, పద్మారావు, గుడాల లింగం, రాజలింగం, నయీం, ఫైజల్‌పాషా, యూసుఫ్, భూమేశ్, అంజయ్య, శంకర్, సుధామ్, తారాసింగ్ పాల్గొన్నారు.

ఇందల్వాయి మండలంలోని అన్సాన్‌పల్లి గ్రామంలో బీఆర్ఎస్ బూత్‌స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రమేశ్‌నాయక్ మాట్లాడుతూ.. బాజిరెడ్డి గెలుపుకోసం ప్రతిఒక్కరూ కష్టపడాలన్నారు. కాంగ్రెస్, బీజేపీ మోసాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యకర్తలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ భూసాని అంజయ్య, పార్టీ మండల అధ్యక్షుడు దాసు, ఎంపీటీసీ చింతల దాసు, నాయకులు పాశంకుమార్, శెట్టి బీరీశ్, గడ్కోల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్న రూరల్ మండల బీఆర్ఎస్ నాయకులు

ఉద్యోగ విరమణ పొందిన సిబ్బందిని సన్మానించిన సీపీ కల్మేశ్వర్

పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటాం : సీపీ

వినాయక్‌నగర్, ఏప్రిల్ 30: పోలీస్ కుటుంబాలకు ఎలాంటి కష్టం వచ్చినా అండగా ఉంటామని సీపీ కల్మేశ్‌ర్ అన్నారు. ఉద్యోగ విరమణ పొందిన సిబ్బందిని సీపీ కార్యాలయంలో మంగళవారం సన్మానించారు. జ్ఞాపికలు అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ కోటేశ్వరరావు, ఏసీపీ శేషాద్రి రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ శ్రీనివాస్‌రావు, ఆర్ముడ్ రిజర్వు ఏసీపీ నాగయ్య, యస్‌బీఐ శ్రీశైలం, ఆర్ఐ వెంకట్, ఆఫీస్ సూపరింటెండెంట్ శంకర్, పోలీస్ సంఘం అధ్యక్షుడు షకీల్ పాషా పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి చెక్కు అందజేత.. వర్ని ఠాణాకు చెందిన కానిస్టేబుల్ మృతిచెందగా, బాధిత కుటుంబానికి పోలీస్ భద్రతా స్కీం కింద రూ.లక్షా 88వేల 345 మంజూరయ్యాయి. ఆ చెక్కును కానిస్టేబుల్ కొడుకు ఉమాకాంత్‌కు సీపీ కల్మేశ్వర్ అందజేశారు.

'పది' ఫలితాల్లో కాకతీయ ప్రభంజనం

శ్రీహిత | నిత్యశ్రీ | రితేశ్‌రెడ్డి | నిత్య షా | అశ్రిత

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 30: పదో తరగతి ఫలితాల్లో నగరంలోని కాకతీయ విద్యాసంస్థలు ప్రభంజనం సృష్టించాయి. ఏకంగా ఎనిమిది మంది.. నిత్యశ్రీ, రితేశ్‌రెడ్డి, జేసన్, నిత్య షా, హాసిని, అశ్రిత, వచన్, శ్రీహిత 10 జీపీఏ సాధించారు. 33మంది 9.8జీపీఏ, 60 మంది 9.7జీపీఏ, 144 మంది 9.5 జీపీఏతో ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులతోపాటు ఇంతటి ఘన విజయం సాధించడానికి కృషిచేసిన ఉపాధ్యాయులను సంస్థ చైర్మన్ విజయలక్ష్మి అభినందించారు. సహకరించిన తల్లిదండ్రులకు డైరెక్టర్లు తేజస్విని, రామోజీరావు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఒలింపియాడ్ ప్రిన్సిపాల్ నటరాజ్, గిరిధర్‌రాజ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఆర్చరీ శిక్షణ

కంఠేశ్వర్, ఏప్రిల్ 30: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు ఉచితంగా ఆర్చరీ శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి ముత్తెన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న 9-18 ఏండ్ల బాల బాలికలు ఈ నెల 3వ తేదీన ఉదయం 7 గంటలకు నగరంలోని నాగారం రాజారాం స్టేడియానికి రావాలని సూచించారు. వివరాలకు కోచ్ మురళి (సెల్ 9848919480)ని సంప్రదించాలని సూచించారు.

సౌత్‌జోన్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

కంఠేశ్వర్, ఏప్రిల్ 30: గత నెల 28 నుంచి కర్ణాటకలో జరిగిన 3వ జూనియర్ సౌత్‌జోన్ జాతీయ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో రాష్ట్ర బాలికల జట్టు ప్రథమ, బాలుర జట్టు ద్వితీయ స్థానం సాధించాయి. ఇందులో జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబర్చినట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ప్రభాకర్ రెడ్డి, గంగా మోహన్ తెలిపారు. బాలికల విభాగంలో జూనియర్ సౌత్‌జోన్ బెస్ట్ ఆల్ రౌండర్ ప్లేయర్‌గా వైశాలి ప్రత్యేక బహుమతిని అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు వారు అభినందనలు తెలిపారు.

రిజర్వేషన్ల తొలగింపు ఎవరి తరమూ కాదు

మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

కంఠేశ్వర్, ఏప్రిల్ 29: బీజేపీ వస్తే రిజర్వేషన్లు తీసేస్తామంటున్నదని, వాటిని తొలగించడం ఎవరితరమూ కాదని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్లు మాఫీచేసిన బీజేపీ ప్రభుత్వం.. రైతులకు రుణమాఫీ ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి గెలుపు ఖాయమని ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు.

బీజేపీ పదేండ్ల పాలనలో వందేండ్ల విధ్వంసం.. నగరంలోని హజ్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ మాట్లాడుతూ.. మోదీ పదేండ్ల పాలనలో వందేండ్ల విధ్వంసం జరిగిందని విమర్శించారు. వికసిత్ భారత్ కాదు.. ఆకలి భారత్, నిరుద్యోగ విలపిత భారత్‌గా మారిందని ఎద్దేవా చేశారు.

ఓటమి భయంతోనే రిజర్వేషన్లపై దుష్ప్రచారం

మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

వినాయక్‌నగర్, ఏప్రిల్ 30: గ్యారెంటీలపై ప్రజలు తిరగబడుతున్నారని, ఓటమి భయంతో రిజర్వేషన్లపై కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తున్నదని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు అధికార బలాన్ని ఉపయోగించి బోగస్ ఓట్లను సృష్టిస్తున్నారని, ఇందూరును ఓల్డ్ సిటీ మాదిరిగా మార్చే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఇందూరు గడ్డ కాషాయానికి అడ్డా అని, రెండు సార్లు మినిస్టర్‌గా పనిచేసిన సీనియర్ నాయకుడిని సైతం ఓడించిన ఘనత ఇక్కడి ప్రజలదని అన్నారు. అధికారులు నిద్రమత్తులో ఉన్నారని, ఎలక్షన్ కోడ్ అంటూ ప్రజల సమస్యలను పట్టించుకోవడంలేదన్నారు.

సంక్షిప్తంగా..

■ **ఉపాధి పనుల తనిఖీ..** ధర్పల్లి, ఏప్రిల్ 30 : మండల కేంద్రంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో బాలకృష్ణ మంగళవారం తనిఖీ చేశారు. కూలీల హాజరును పరిశీలించారు.

■ **గ్రామసభ..** కోటగిరి, ఏప్రిల్ 30: మండల కేంద్రంలోని పంచాయతీ అవరణలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రత్యేకాధికారి ఎంపీడీవో మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భూగర్భజలాలు తగ్గిపోయాయని, ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ఎంపీటీసీ మనోహర్, కార్యదర్శి ముజబుర్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.

■ **పశువైద్య శిబిరం..** రుద్రూర్, ఏప్రిల్ 30: ఆహార శాస్త్ర సాంకేతిక కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ క్యాంపులో భాగంగా మండలంలోని రాయకూర్ గ్రామంలో మంగళవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. జీవాలను పరీక్షించి మందులు వేశారు. అనంతరం వలంటీర్లు స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ సమీన్, జె.సాయిలు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

■ **డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు..** వినాయకనగర్, ఏప్రిల్ 30: నగరంలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో ట్రాఫిక్ పోలీసులు 8 మంది వాహనదారులపై కేసులు నమోదు చేశారు. వారికి ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించిన అనంతరం మంగళవారం సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ సయ్యద్ ఖదీర్ ఎదుట హాజరుపర్చారు. ఆరుగురికి జడ్జి రూ.6,500 జరిమానా విధించారు. మరో ఇద్దరికి రెండు రోజుల చొప్పున జైలు శిక్ష విధించినట్లు ఏసీపీ ఏ.నారాయణ తెలిపారు.

■ **బీజేపీ.. రైతు వ్యతిరేకి..** డిచ్‌పల్లి, ఏప్రిల్ 30: రైతు వ్యతిరేకి బీజేపీని ఓడించాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య కోరారు. మండలకేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. రైతులు, వ్యవసాయ రంగాన్ని బీజేపీ తీవ్ర నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు.

■ **అప్పుల బాధతో ఆత్మహత్య..** వినాయక్‌నగర్, ఏప్రిల్ 30: నగరంలోని ఆర్యనగర్‌కు చెందిన రాజవరపు శ్రీనివాస్(50) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఎల్లమ్మగుట్ట పరిధిలోని ట్రాక్‌పై మంగళవారం సాయంత్రం 6 గంటలకు ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు.

'పది'లో మెరిసిన ప్రభుత్వ కుసుమాలు

■ 10 జీపీఏ సాధించిన విద్యార్థులు ■ అభినందించిన టీచర్లు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, ఏప్రిల్ 30: ఎస్సెస్సీ ఫలితాల్లో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు సత్తా చాటాయి. రూరల్ మండలంలోని పాఠశాలలు 95.49 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో రామారావు తెలిపారు. ఐదు హైస్కూళ్లలో వందశాతం ఉత్తీర్ణత వచ్చిందని పేర్కొన్నారు. డిచ్‌పల్లి మండలంలో 93.04 శాతం ఉత్తీర్ణత నమోదయ్యిందని ఎంఈవో రాజగంగారాం తెలిపారు. ఆదర్శ పాఠశాలకు చెందిన ఎం అమూల్య, ధర్మారం గురుకుల విద్యార్థిని పీ వనిత, సుద్దపల్లి గురుకులానికి చెందిన పీ మానస, మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల విద్యార్థి డి నిశాంత్‌రెడ్డితో పాటు ప్రైవేట్ స్కూళ్లకు చెందిన ముగ్గురు 10 జీపీఏ సాధించారని ఎంఈవో తెలిపారు. ధర్పల్లి మోడల్ స్కూల్ 99శాతం ఉత్తీర్ణత సాధించగా చందన, అంకిత, మేఘన, అక్షయ, పల్లవి 10 జీపీఏ సాధించారని ప్రిన్సిపాల్ రాజేందర్ తెలిపారు. సిరికొండ మండలంలోని విద్యార్థులు 96.80 శాతం ఉత్తీర్ణత సాధించారు. 17 పాఠశాలలకు 9 స్కూళ్లు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. జ్యోతిబా పూలే పాఠశాలకు చెందిన అమూల్య 10 జీపీఏ సాధించిందని ఎంఈవో శ్రీనివాస్ తెలిపారు. రుద్రూర్ కేజీబీవీ 97 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎస్‌వో శ్యామల తెలిపారు.

మోర్తాడ్ మండలంలో 90.4శాతం, కమ్మర్‌పల్లి మండలంలో 95.5 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణతను సాధించినట్లు ఎంఈవో ఆంధ్రయ్య తెలిపారు. సుంకెట్, శెట్‌పల్లి, దొన్కల్, మోర్తాడ్ పాఠశాలలు వందశాతం ఉత్తీర్ణతను సాధించాయి. కమ్మర్‌పల్లి మండలంలో మొత్తం 360 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 344 మంది ఉత్తీర్ణతను సాధించినట్లు చెప్పారు. చౌట్‌పల్లి, హసాకొత్తూర్, కోనాపూర్ పాఠశాలలు వందశాతం ఉత్తీర్ణతను సాధించగా, కమ్మర్‌పల్లి పాఠశాలకు చెందిన ఫైజాన్ 10 జీపీఏ సాధించాడు. ఏర్గట్ల మండలంలో 65.81 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో ఆంధ్రయ్య తెలిపారు. భీమ్‌గల్ మండలంలో మొత్తం 22 పాఠశాలల్లో 19 పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఇందులో ఐదుగురు విద్యార్థులు 10 జీపీఏ సాధించారని ఎంఈవో స్వామి తెలిపారు. మాక్లూర్ మండలంలో 99.22 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో రాజగంగారెడ్డి తెలిపారు. పది ప్రభుత్వ పాఠశాలలతోపాటు కస్తూర్బా వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. మహాత్మాజ్యోతిబాపూలే పాఠశాలలో ఐదుగురు విద్యార్థినులు 10 జీపీఏ సాధించినట్లు తెలిపారు. నవీపేట మండలంలో ప్రభుత్వ పాఠశాలు 98-100 శాతం ఉత్తీర్ణత సాధించాయి. ముబాశిర నాజ్, నాబిలా నిశిత్ 10 జీపీఏ సాధించినట్లు ఎంఈ వో గణేశ్‌రావు తెలిపారు. రెంజల్ మండలంలో 98శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో తెలిపారు. రెంజల్, దూపల్లి, కునేపల్లి , సాటాపూర్‌ఫాం, తాడ్‌బిలోలి, నీలా కందకుర్తి పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణత నమోదైనట్లు పేర్కొన్నారు.

సీనియర్ నాయకుడు బుద్దె రాజేశ్వర్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ రఘూత్తం రెడ్డి

బాధిత కుటుంబానికి ఎమ్మెల్సీ పరామర్శ

బోధన్ రూరల్, ఏప్రిల్ 30: తెలంగాణ ఉద్యమకారుడు, సీనియర్ నాయకుడు, రైతు బంధు సమితి మండల మాజీ కన్వీనర్ బుద్దె రాజేశ్వర్ ఇటీవల మృతి చెందగా.. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్సీ రఘోత్తం రెడ్డి మంగళవారం పరామర్శించారు. రాజేశ్వర్ మృతిపై విచారం వ్యక్తం చేస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ధైర్యం కోల్పోవద్దని రాజేశ్వర్ సతీమణి బోధన్ ఎంపీపీ బుద్దె సావిత్రికి ధీమా ఇచ్చారు.

'శ్రీవిజయసాయి' విజయదుందుభి

సీహెచ్ కీర్తన 10/10 జీపీఏ | బి.వైష్ణవి 10/10 జీపీఏ | ఎ.శ్రీష 10/10 జీపీఏ | మహిమా చౌదరి 10/10 జీపీఏ | ఎ.ధనుంజయ 10/10 జీపీఏ

బోధన్, ఏప్రిల్ 30: 'పది' ఫలితాల్లో బోధన్‌కు చెందిన శ్రీ విజయసాయి హైస్కూల్ విజయదుందుభి మోగించింది. మొత్తం 12 మంది విద్యార్థులు పదికి పది గ్రేడ్ పాయింట్లు సాధించి రికార్డును సృష్టించారు. 10 జీపీఏల సాధనలో బోధన్ డివిజన్‌లో మొదటి స్థానం, జిల్లాస్థాయిలో రెండో స్థానంలో ఈ హైస్కూల్ నిలిచింది. సీహెచ్ కీర్తన, బి.వైష్ణవి, ఎ.శ్రీష, సీహెచ్ మహిమా చౌదరి, వై.మేరీ ఆశ్రితారెడ్డి, ఎ.ధనుంజయ, బి.మణిచంద్ర, కె.సత్యనారాయణ్, ఎం.హరికృష్ణ, ఎం.లక్ష్మీకాంత్, పి.లోకేష్ పటేల్, ఆర్.హరిగోపాల్ అనే విద్యార్థులు 10/10 జీపీఏ సాధించి తమ సత్తా చాటారు. 18 మంది విద్యార్థులకు 9.8 జీపీఏ, 27 మంది విద్యార్థులకు 9.7 జీపీఏ, 19 మంది విద్యార్థులకు 9.5 జీపీఏ, 24 మంది విద్యార్థులకు 9.3 జీపీఏ, 25 మంది విద్యార్థులకు 9.2 జీపీఏ, 23 మంది విద్యార్థులకు 9.0 జీపీఏలు వచ్చాయి. 9 జీపీఏ కన్నా ఎక్కువ జీపీఏ పాయింట్లు 148 మందికి వచ్చాయి. ప్రతిభను చాటిన విద్యార్థులను హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.కృష్ణమోహన్, మేనేజర్ ఐఆర్ చక్రవర్తి అభినందించారు.

'మాతృశ్రీ' విద్యార్థుల ప్రతిభ

ఎం.సమన్విత 10 జీపీఏ | సీహెచ్ ప్రణవి 10 జీపీఏ | మిద్‌హత్ ఆఫ్రిన్ 10 జీపీఏ

సమియా ముంతాజ్ 10 జీపీఏ | లక్ష్మీనారాయణరెడ్డి 10 జీపీఏ

బోధన్, ఏప్రిల్ 30 : పదో తరగతి ఫలితాల్లో బోధన్ పట్టణానికి చెందిన మాతృశ్రీ హైస్కూల్ విద్యార్థులు అత్యుత్తమ జీపీఏలు సాధించి ప్రతిభను చాటారు. 8 మంది విద్యార్థులు 10/10 జీపీఏ సాధించారు. ఎం.సమన్విత, సీహెచ్ ప్రణవి, ఎస్.శ్రావణి, పి.సాయి సుకృతి, ఎం.లక్ష్మీనారాయణ రెడ్డి, ఎండీ ఫహద్ అహ్మద్, మిద్‌హత్ ఆఫ్రిన్, సమియా ముంతాజ్ 10 జీపీఏ సాధించి సత్తా చాటారు. ఏడుగురు విద్యార్థులు 9.8 జీపీఏ, 8 మంది 9.7 జీపీఏ, 10 మంది 9.5 జీపీఏ తెచ్చుకున్నారు. 9 జీపీఏ కన్నా ఎక్కువ జీపీఏలను మొత్తం 64 మంది విద్యార్థులు పొందారు. పాఠశాలలో 96 శాతం ఉత్తీర్ణతను సాధించారు. ప్రతిభను చాటిన విద్యార్థులను కరస్పాండెంట్ దిగంబర్‌రావు అభినందించారు.

'ఇందూర్' హైస్కూల్ హవా..

జె.స్నేహ | దుర్గా భవాని | పూజ | వేదాంత్

బోధన్, ఏప్రిల్ 30: పదో తరగతి ఫలితాల్లో బోధన్ పట్టణం ఆచన్‌పల్లిలోని ఇందూర్ హైస్కూల్ విద్యార్థులు అత్యుత్తమ జీపీఏ సాధించి సత్తా చాటారు. జె.స్నేహ 10/10 జీపీఏ సాధించింది. మరో నలుగురు విద్యార్థులు దుర్గా భవానీ, పూజ, వేదాంత్, రామ్‌చరణ్ 9.8 జీపీఏ సాధించారు. 10 మంది విద్యార్థులకు 9.7 జీపీఏ, 9 మంది విద్యార్థులకు 9.5 జీపీఏ, 11 మంది విద్యార్థులు 9.3 జీపీఏ, 12 మందికి 9.2 జీపీఏ, 17 మంది విద్యార్థులకు 9 జీపీఏ వచ్చింది. మొత్తం 64 మంది విద్యార్థులకు 9 లేదా అంతకన్నా ఎక్కువ జీపీఏ సాధించారు. సత్తాను చాటి అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ కొడాలి కిశోర్ అభినందించారు.

నేడు బోధన్ మండలంలో బీఆర్ఎస్ కార్నర్ మీటింగ్

బోధన్ రూరల్, ఏప్రిల్ 30: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా బోధన్ మండలంలోని పలు గ్రామాల్లో కార్నర్ మీటింగ్‌లను బుధవారం నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ బోధన్ మండల అధ్యక్షుడు సంజీవ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ సహా పలువురు పార్టీ ప్రముఖులు పాల్గొంటారని పేర్కొన్నారు. సాయంత్రం 5 గంటలకు పెగడాపల్లి,6 గంటలకు కల్దుర్కి గ్రామాల్లో ప్రచార సభలు ఉంటాయని తెలిపారు. మండలంలోని ప్రజలు, బీఆర్ఎస్ అభిమానులు, నాయకులు హాజరుకావాలని ఆయన కోరారు.

వడదెబ్బతో వృద్ధుడి మృతి

రెంజల్, ఏప్రిల్ 30 : మండలంలోని కునేపల్లి గ్రామంలో ఓ వృద్ధుడు వడదెబ్బతో మృతి చెందినట్లు ఎస్సై సాయన్న మంగళవారం తెలిపారు. భిక్షాటన చేస్తూ జీవనం గడిపే సారకు గురప్పా (65) రోజుమాదిరిగానే ఓ హోటల్‌లో టిఫిన్ చేస్తుండగా బెంచ్‌పై నుంచి కిందపడిపోయి మృతిచెందినట్లు పేర్కొన్నారు. కొడుకు సాయిలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు శవ పంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహన్ని బోధన్ ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు ఎస్సై తెలిపారు. వృద్ధుడు ఎండ తీవ్రతను తట్టుకోలేక మృతి చెందినట్లు పేర్కొన్నారు.

వీడీసీ సభ్యులపై కేసు నమోదు

నవీపేట, ఏప్రిల్ 30: రెవెన్యూ అధికారుల అనుమతులతో ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను అడ్డుకున్న నాళేశ్వర్ వీడీసీ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం..బినోలా గ్రామానికి చెందిన కొందరికి ఇండ్ల నిర్మాణం కోసం నిజాంపూర్,నాళేశ్వర్ వాగులో నుంచి ఇసుకను తీసుకోవడానికి తహసీల్దార్ అనుమతి ఇచ్చారు. దీంతో అనుమతి తీసుకున్న ముగ్గురు ట్రాక్టర్ ద్వారా ఇసుకను తరలిస్తుండగా నాళేశ్వర్ వీడీసీ సభ్యులు అడ్డుకొన్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ నారాయణ, ఎస్సై యాదగిరిగౌడ్ సోమవారం రాత్రి నాళేశ్వర్ గ్రామానికి చేరుకొని అనుమతులు ఇచ్చామని చెప్పారు. కానీ వీడీసీ సభ్యులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఎంత చెప్పినా ట్రాక్టర్లను వదిలిపెట్టలేదు. దీంతో తహసీల్దార్ నారాయణ నివేదిక ఆధారంగా నాళేశ్వర్ వీడీసీ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు.

రేణుకా ఎల్లమ్మ కల్యాణోత్సవం

ఎడపల్లి, ఏప్రిల్ 30: మండల కేంద్రంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో గౌడ కులస్తుల ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మ కల్యాణోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి, బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED
★SR ఆక్వా సొల్యూషన్స్, నిజామాబాద్ వాటర్ ప్యూరి ఫైయర్స్ నందు పనిచేయుటకు టెక్నిషియన్ (Male) కావలెను. Qual: ఇంటర్, జీతం + ఇన్సెంటివ్ సంప్రః 98482 68883
NTZ-324910

WANTED
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16k to 18k, ఏజెంట్ కమీషన్ 6k. Ph: 9640258899, 9640468899
NT-311845-AII

CHANGE OF NAME
I, KOLIPYAKA RAJUBAI H.No.3-76/1, Jankampet, (M) Velpur, (D) Nzb. Changed My Surname/ Name as KOLPYAK RAJUBAI W/o. KOLPYAK BAL REDDY

CHANGE OF NAME
I, KOLIPYAKA BALREDDY, H.No.3-76/1, Jankampet, (M) Velpur, (D) Nzb. Changed My Surname/ Name as KOLPYAK BAL REDDY S/o. KOLPYAK NARSAIAH

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.